


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

సోమవారం 29 సెప్టెంబర్ 2025 - పేజీలు 8





# మందుల్లో మతలబు..

**ప్రజలకు దసరా కానుకగా జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది.. ఈనెల 22 నుంచి కొత్త శ్లాబులను అమల్లోకి తెచ్చింది.. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతో పాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది.. అయితే ప్రతి ఇంట్లో ఉపయోగించే మందులపైన ప్రజల్లో అవగాహన లోపం వ్యాపారులకు వరంగా మారింది.. జీఎస్టీ అమలులోకి వచ్చిన తేదీకి ముందే రేట్లు ముద్రించడంతో అవి కాస్తా హోల్‌సేల్ నుంచి రిటైల్ షాపులకు చేరాయి.. దీంతో జీఎస్టీ తగ్గింపు సాధ్యపడే పరిస్థితి లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు.. మరోవైపు కేంద్రం పాత రేట్లతో పనిలేదు.. జీఎస్టీ తగ్గింపు నాటి నుంచే అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.. అయితే అది ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అమలుకావడం లేదు.. దీంతో మందుల్లో మతలబుతో జనానికి ఎటువంటి ఊరట లభించడం లేదు..**

**- నేటి దినపత్రిక సూర్య పల్నాడు/ గుంటూరు ప్రతినిధి**

- పాత ఎమ్మార్పీలతోనే అమ్మకాలు
- ఇప్పటికే 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామంటున్న వ్యాపారులు
- కొనుగోలుదారుల్లో అవగాహన లోపం
- భారీగా నష్టపోతున్నా స్పందించని అధికారులు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో మరింత దోపిడీ

గతంలో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో మందుల షాపుల వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండేది. కొవిడ్ సమయం నుంచి దశమారింది. ఒక్కసారిగా మందుల వాడకం అధికమైంది. పనిలోపనిగా సాధారణ జ్వరం బిళ్ల నుంచి సూది మందు వరకు రేట్లు రెండింతలు పెరిగాయి. దీంతో వ్యాపారం మరింత ఊపందుకుంది. ఆ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మెడికల్ షాపుల సంఖ్య రెట్టింపు అయింది. ప్రస్తుతం జిల్లాల్లో వందల్లో హోల్‌సేల్ దుకాణాలు, వేలల్లో రిటైల్ షాపులు నడుస్తున్నాయి. అయితే మందుల్లో లాభాలకు అలవాటుపడిన వ్యాపారుల్లో పోటీతత్వం పెరిగింది. కార్పొరేట్ సంస్థలతోపాటు పెద్దస్థాయి దుకాణాలు వెలిశాయి. దీంతో పలురకాల మెడిసిన్స్‌పై 10 నుంచి 20 వరకు డిస్కౌంట్‌లు ప్రకటించి అమ్మకాలు చేస్తున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం ఇప్పటి వరకు మెడిసిన్స్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించింది. అది ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. అయితే వ్యాపారులు మాత్రం ధరలు తగ్గించడం లేదు. ప్రజల్లో అవగాహన లేమి కూడా వ్యాపారులకు మరింత కలిసివచ్చింది. మందులపై తగ్గిన జీఎస్టీపై పలువురు వ్యాపారులను ప్రశ్నిస్తుండగా, జీఎస్టీ ఈనెల 22 నుంచి మాత్రమే అమలులోకి వచ్చిందని వెల్లడిస్తున్నారు. అప్పటికే మందులపై ధరలు, బ్యాచ్ నంబర్లు ముద్రించారంటున్నారు. ఒక్కో రకం మందుపై ఏడాదిన్నర వరకు గడువు ఉంటుందని, ఇప్పటికి ఇప్పుడు మార్చడం వీలు కాదని చెబుతున్నట్లు తెలిసింది. గతంలో మెడికల్ దుకాణాల నిర్వాహకులు రూ.5 వేలకు మందులు కొనుగోలు చేస్తే రూ.250 నుంచి రూ.600 వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం పూర్తిగా మినహాయించిన నేపథ్యంలో కొంతమేర తగ్గించాల్సి

**మిగతా 3వ పేజీలో**

## ప్రతి గుండె చప్పుడు విలువైనదే

### నేడు వరల్డ్ హార్ట్ డే

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే జరుపుకుంటారు. ప్రతి సంవత్స రం ఒక నినాదం ఇస్తారు. ఈ సంవత్సరం (డోంట్ మిస్ ఏ బీట్) ప్రతి గుండె చప్పుడు విలువైనదే అనే నినాదం ఇచ్చారు. గుండె సంబంధిత వ్యాధుల వల్ల ( కార్డియాక్యులర్ డిసీస్ సివిడి) అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు గుండె జబ్బులే ప్రథమ కారణం. ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా లక్షలాది ప్రాణాలను రక్షించకోవచ్చని లలితా హాస్పిటల్స్ ప్రముఖ కార్డియాలజిస్ట్ మరియు అధినేత డాక్టర్ రాఘవ శర్మ తెలిపారు. గత దశాబ్దంలోనే

**మిగతా 3వ పేజీలో**









## కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యానికి రక్ష

### మేయర్ కోవెలమూడి రవీంద్ర

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యానికి రక్ష అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆదివారం గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌజన్యంతో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు షుమారు 3వేల మందికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నేతృత్వంలో సఫాయి మిత్రా సురక్షా షివిర్‌లో భాగంగా లక్ష్మీపురం మెయిన్ రోడ్‌లోని పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ ప్రాంగణంలో గైనిక్, కార్డియాలజీ, ఇసిజి, ఎకో, యూరాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, డయాబెటాలజీ, ఆప్తాల్మలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్టీ, నెఫ్రాలజీ, పల్మనాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కాలేయానికి సంబందించి అతి ముఖ్యమైన ఫైబ్రోస్కాన్, పిడియాట్రిక్స్ లకు సంబందించి, ఉచిత వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, మందులు అందించేలా 30 నిపుణులైన వైద్య బృందంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ జరిగింది. మేయర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే ప్రజారోగ్య కార్మికులు నిత్యం డ్రైన్ల వెంబడి, ప్రమాదకర వ్యర్థాలు శుభ్రం చేస్తూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారి కోసం గుంటూరు నగరపాలక సంస్థ అత్యుత్తమ సేవలతో కూడిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తుందన్నారు. ప్రజారోగ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఐఎంఏ సహకారంతో ప్రజారోగ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు

**మిగతా 3వ పేజీలో**

# గుర్రం జాషువా జయంతి, భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**ఈపూరు మేజర్ న్యూస్ :** ఈపూరు గ్రంథాలయ శాఖలో గుర్రం జాషువా మరియు భగత్ సింగ్‌ల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగినది. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ గుర్రం జాషువా నవయుగ చక్రవర్తి అని బిరుదు, తెలుగు సాహిత్యం ధ్రువతారగా వెలుగొందిన మహానీయుడు, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత ఆయన కేవలం కవి మాత్రమే కాదు, కుల వివక్ష అంటరానితరం వంటి సామాజిక రుగ్మతలపై తన కలాన్ని ఖడ్గంగా ఝుళిపించిన గొప్ప సంఘసంస్కర్త తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. భగత్ సింగ్ భారత స్వతంత్ర సంగ్రామంలో అగ్ని కెరటం కేవలం 23 సంవత్సరాల వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుడు నేటికీ యువ తరానికి స్ఫూర్తిని రగిలిస్తూనే ఉన్నారూ ఆయన కేవలం ఒక స్వతంత్ర సమరయోధుడు మాత్రమే కాదు గొప్ప విప్లవకారుడు ఆలోచనపరుడు మరియు సామ్రాజ్యవాద వ్యతిరేకి అని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు.

# వైయస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ



**ఈపూరు మేజర్ న్యూస్ :** వైయస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ PA C మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పడే కష్టాలను బాధలను ఈ డిజిటల్ బుక్ నందు పొందుపరచవచ్చును. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నాయకులు అధికారులు పెట్టే ఇబ్బందులను ఈ డిజిటల్ బుక్ లో పందుపరిస్తే రేపు జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ట్రాన్ఫర్ లేదా రిటైర్డ్ అయిన సరే వదిలే ప్రసక్తి లేకుండా న్యాయపరంగా శిక్షించే విధంగా జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవటానికి ఈ డిజిటల్ బుక్ ఎంతగానో దోహదపడుతుందని వినుకొండ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. కూటమి నాయకుల అన్యాయాలకు అక్రమాలకు గురైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్త ఆవేదన ఈ డిజిటల్ బుక్ ద్వారా వైయస్ జగన్మోహన్ రెడ్డి వద్దకు చేరుతుందని ఇది జగనన్న మనకు ఇచ్చిన ఒక రక్ష అని తెలియజేశారు.

# ధనలక్ష్మిగా దర్శనమిచ్చిన వాసవి అమ్మవారు

**మాచవరం, మేజర్ న్యూస్ :**

దేవిశరన్నవరాత్రుల మహోత్సవములలో భాగంగా మాచవరం లోని వాసవి కళ్యాణం మండపం లో వాసవి అమ్మవారిని ధనలక్ష్మీగా ఆలకించారు. శివాలయంలో వన దుర్గాదేవీగా అలంకరించారు. పలు దేవాలయాలు లో పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ వంకాయల రమేష్ ప్రసాదాలు అందజేశారు. మండపం ఆద్య షూలు చిటిప్రోలు నరసింహారావు కార్యక్రమంలు నిర్వహించి ప్రజల చే భేష్ అనిపించుకున్నారు. మండ లంలోని చెన్నాయపాలెం గ్రామంలో కొలువైన శ్రీ రేణుకా మహిషాసుర మర్ధిని అమ్మవారు ఏడవ రోజున శ్రీ మహా చండీ దేవి దర్శనమిచ్చారు భక్తులు చే అలయ పూజారి జానపాటి సీతారామశర్మ కుంకుమార్చన నిర్వహించారు వారు చండికా గురించి భక్తులకు వివరిస్తూ దసరా ఉత్సవాల సమయమిది దుర్గమ్మను ప్రపంచ వ్యాప్తంగా భక్తులు పూజిస్తున్న పవిత్ర తరుణమిది మాత చాలా ప్రచండ శక్తి. ఒక్క భూగ్రహమే కాకుండా విశ్వాంతరాళాలని అంటిపెట్టుకునే ఉంటుంది. సృష్టి జరగడానికి, అదివృద్ధి చెందడానికి, తిరిగి లయం కావడానికి అవసరమైన శక్తి అంతా ఆమెలోనే ఉంది. ఆమె ఆది శక్తి, పరాశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛా శక్తి, క్రియా శక్తి, కుండలినీ శక్తి. అందుకే ఆమెకు అంత ప్రాధాన్యంత ఉంటుంది అన్నివారు భక్తులకు వివరించారు. చండికా అమ్మవారిని దర్శంచుకొని భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# 1100 సేవలు వినియోగించుకోవాలి : కలెక్టర్ కృత్తికా శుక్ల

**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 29వ తేదీన సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలం రొంపిచర్ల గ్రామంలోని టీ.టీ.డీ. కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు భారీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల పర్యవేక్షణలో నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ గాయత్రి, నరసరావుపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దిన్, సెక్రెటరీ భవనం మునీందర్ రెడ్డి, రోటరీ క్లబ్ డైరెక్టర్ లు ఎస్.కె. జిలానీ మాలిక్, జమ్ముల రాధా కృష్ణ, మేళ్లచెరువు సుమిత్ర కుమార్, మామిడి సుబ్బారావు, ఓగూరి సైదయ్య,డి.వి.ఎస్.ఎన్. పున్నారావు, లింగ ఆంజనేయులు, రొంపిచర్ల గ్రామ సర్పంచ్ చక్రారెడ్డి, టిటిడి కళ్యాణ మండపం కాంట్రాక్టర్ కెల్లి పిచ్చిరెడ్డి, రొంపిచర్ల గ్రామస్తులు తదితరులు ప్రారంభించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లా నరసరావుపేట ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల,గుంటూరు పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షుమారు 300 వందలమందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 150 మంది ఆపరేషన్ కు సెలెక్ట్ అయ్యారు. ఈ మెడికల్ క్యాంపుకు శంకర్ కంటి అస్పటల్ మెడికల్ క్యాంప్ ఇంచార్జ్ మరియు నర్సింగ్ స్టాఫ్, ఈశ్వర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితర సభ్యులు హాజరయ్యారు. అలాగే టిటిడి కళ్యాణ మండపం ఆవరణంలో అందరూ కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అనుగుణంగా వైద్య నిబంధనలు పాటిస్తూ



మగ వాళ్ళకు, ఆడవాళ్లకు అందరిని కలిపి షుమారు 300 మంది కి బిపి చెకప్ చేసి కంటి పరీక్షలు చేయగా వారిలో షుమారు 150 మంది ఆపరేషన్ కు సెలెక్ట్ అయ్యారనీ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ఆహారం విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం విషయంలో నిపుణుల సలహాలు తప్పనిసరి గా పాటించాలని, మీ ఫ్యామిలీ డాక్టర్ లతో సంప్రదించి సలహాలు, సూచనలను తీసుకోవాలని, శుక్లం ఉండి ఆపరేషన్ కు అర్హులైన పేద వారికి డాక్టర్ల సలహా మేరకు పూర్తి స్థాయిలో ఉచితముగా ఆపరేషన్ చేసి కంటి లోపల అద్దములు (ఐ ఓ ఎల్)అమార్చబడును అన్నారు. కంటి పరీక్షలు పూర్తి అయిన పిదప ఆపరేషన్ అవసరమైన వారికి కంటి ఆసుపత్రి వారి బస్సులో ఉచితముగా తీసుకొని వెళ్లడం జరుగుతుందని, వారికి మందుల ఖర్చు మరియూ భోజన వసతి ఆసుపత్రి వారే భరిస్తారన్నారు. కంటి ఆపరేషన్ కొరకు వచ్చేవారు తలస్నానం చేసి రావాలన్నారు మెడికల్ శిబిరాల వద్దకు వచ్చేవారు రేషన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్ కార్డు మొదలైన ప్రభుత్వంచే ఇవ్వబడిన వాటిని ఏదో ఒకటి జిరాక్స్ కాపీ తీసుకొనిరావాలన్నారు. పేద ప్రజలందరూ తప్పనిసరిగా ఇలాంటి మెడికల్ క్యాంప్ లు వినియూగించుకోవలనీ,ఈ మెడికల్ క్యాంప్ కు విచ్చేసిన పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచి నీరు, అల్పాహారం ఇవ్వడం జరిగిందన్నారు.

# సాహితీ గగనములో విశ్వ మానవుడు గుర్రం జాషువా

## – ఘనంగా విశ్వనరుడికి 13వ జయంతి నివాళి



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజా కవి, కలియుగ నవ వైతాళికుడు శ్రీ. గుర్రం జాషువ 130వ జయంతిని పురస్కరించుకొని దళిత సంఘాలు, సాహిత్య అభిమానులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా ఇవాళ నేర్పించడం జరిగింది. గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్ లో వున్న కవికోకిల గుర్రం జాషువా సాహితీ సేవ సంస్థ ప్రతిష్టించిన ఆయన విగ్రహమును పూలమాలలతో అలంకరించి ఘనముగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి సాహిత్య అభిమానులైన పట్టణ ప్రముఖులు – శ్రీ జాషువా సాహిత్యాన్ని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది బత్తిన శ్రీనివాస బాబు, సంస్థ కోశాధికారి శ్రీ కలపాల ప్రేమ్ కుమార్, జాషువా సాహిత్యమును కొనియాడారు. ఈ కార్యక్ర మములో సంస్థ కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు డా. ఏ.యన్. ఆర్. జక్కం, కార్యదర్శి న్యాయవాది గుజ్జర్లపూడి సురేష్ బాబు, కోశాధికారి కలపాల ప్రేమ కుమార్ , సభ్యులు గుజ్జర్లపూడి జాన్ బాబు, న్యాయవాది గుజ్జ ర్లపూడి జయ కుమార్, టిడిపి నాయకులు కూచిపూడి కోటేశ్వర రావు, గుర్రం అనిల్ కుమార్, పి ఆనంద్ భరత్ న్యాయవాది, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



**వైయస్సార్ సిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు జాషువా సాహిత్య సేవను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు ఎస్ఎస్ఎల్ నాయకులు తదితరులు ఉన్నారు.

**ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో...**

గుఱ్ఱం జాషువా 130 వ ఎమ్మార్పీఎస్ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గరికపాటి రవి కుమార్ మాదిగ గారు, నాయకులు,కార్యకర్తలు తదితరులు.

# జీవిత మార్పునకు చదువు సాధనం : బాలలత

**గుంటూరు, మేజర్ న్యూస్**

చదువు జీవిత మార్పునకు సాధనమని, ఎన్ని కష్టాలు ఉన్నా ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ప్రముఖ పోటీ పరీక్షల మోటివేషనల్ స్పీకర్ మల్లవరపు బాలలత అన్నారు. ఆదివారం స్థానిక ఏసీ కాలేజీలో మానవత సంస్థ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ తాను పోలియో వలన అంగవైకల్యంతో రెండు కాళ్లు కోల్పోయినా ఇంటి వద్దనే విద్యను కొనసాగించానని, పట్టుదలతో క్రమశిక్షణతో చదివి రెండుసార్లు సివిల్స్ పరీక్షల్లో ర్యాంకులు సాధించానని చెప్పారు. ఐఏఎస్ కృష్ణతేజ తన వద్ద శిక్షణ పొందారని, ప్రతిరోజు ఉదయం నాలుగున్నర గంటలకు వచ్చి పరీక్ష రాసేవారని, అలా సంవత్సరం పాటు నిరంతరం పరీక్షలు రాస్తూ సివిల్స్ పరీక్షల్లో 66వ ర్యాంకు సాధించి, నేడు అత్యున్నత అధికారిగా మంచి పేరుతో పనిచేస్తున్నారని తెలిపారు. వందశాతం దృష్టిపెడితే రెండు వందల శాతం ఫలితాలు వస్తాయని, ఏ పనిని వాయిదా వేసే అలవాటు మానుకోవాలన్నారు. ప్రతిరోజు కనీసం 15 గంటలు చదవాలని, రోజూ దినపత్రికలు




మాట్లాడుతున్న బాలలత

చదవాలని, స్మార్ట్ వర్క్ చేయాలని వివరించారు. లక్ష్యసాధన కోసం ప్రణాళిక బద్ధంగా అధ్యయనం చేయాలన్నారు. జీవితంలో విజయాలు సాధించిన వారిని రోల్‌మోడల్‌గా తీసుకొని వారి పంథాలో నడవాలన్నారు. వివిధ అంశాలపై వ్యాసాలు రాయాలని, పాత పరీక్షా పత్రాలను అధ్యయనం చేయాలని, నిరంతరం ప్రాక్టీస్ చేయాలని చెప్పారు. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలను అవగాహనతో చదవాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ అంగవైకల్యాన్ని అధిగమించి, ఆత్మ విశ్వాసంతో కృషిచేసి మల్లవరపు బాలలత అనేక విజయాలు సాధించి, నేడు పోటీ పరీక్షల మోటివేషనల్ స్పీకర్‌గా కొనసాగు తున్నారని అన్నారు. అనంతరం మానవతా సంస్థ బృందం బాలలతను సత్కరించారు. కార్యక్రమంలో మానవత కార్యదర్శి కె.సతీష్, చావా శివాజీ, చావా లక్ష్మి సామ్రాజ్యం, ఉప్పాల సాంబశివరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే కురుబల ఉన్నతి సాధ్యం : మంత్రి సవిత

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత ,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఐక్యమత్యంతో కురుబలు మెలగాల్సిన అవసరముందన్నారు. అమరావతిలో భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరిలో ఓ కన్వెన్షన్ సెంటర్ లో ఆదివారం నిర్వహించిన కురుబ, కురువ, కురుమ సామాజిక వర్గీయుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయుంతా ఒక్కటేనని, వారంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవు తుందని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరమవు తుందని, అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధ్యమవు తుందని తెలిపారు. కురుబ, కురుమ, కురువ పేద విద్యార్థులకు అండగా నిలుద్దామని, అందుకు తాను వ్యక్తిగతంగా ఎల్లవేళలా సాయమందిస్తానని తెలిపారు.





**అమరావతిలో కనకదాస విగ్రహం**

అమరావతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇదే విషయమై సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. తిరుపతిలో భక్త కనకదాస పీఠం ఏర్పాటుపైనా సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. వచ్చే నెల అయిదో తేదీన తిరుపతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నామని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

**చంద్రబాబుతోనే కురుబలకు మేలు**

సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతోనే కురుబలకు ఎంతో మేలు కలుగుతోందని మంత్రి సవిత తెలిపారు. కురుబల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఆయన ఎంతగానో వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. కురుబలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఎంపీలుగానూ, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా సేవచేస్తున్నట్లు తెలిపారు. ఇదంతా సీఎం చంద్రబాబు వల్లేనన్నారు. గత ఎన్నికల్లో కురుబలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కురుబలను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తిరుపతిలో వచ్చే నెల 5న జరిగే భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను మంత్రి సవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వివిధ జిల్లాలకు చెందిన కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి గుండె చప్పుడు విలువైనదే

(మొదటి పేజీ తరువాయి)

కార్డియోవాస్క్యులర్ డిసీజ్ (సివిడి) వలన మరణాలు దాదాపు రెండింతలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 2.05 కోట్లకు పైగా మరణాలు గుండె సంబంధిత వ్యాధుల వలన సంభవిస్తున్నాయి. వీటిలో 80% వరకు మరణాలను ముందస్తు పరీక్షలు, సకాలంలో వైద్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా నివారించవచ్చు. భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. మన దేశంలో నమోదవుతున్న మొత్తం మరణాల్లో 27% గుండె సంబంధిత వ్యాధులవల్లే జరుగుతున్నాయి. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం, ప్రతి 1 లక్ష జనాభాకి 272 మంది గుండె వ్యాధులతో మరణిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు (235/1,00,000) కంటే ఎక్కువ. ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల హెచ్చరిక సంకేతాలను గుర్తించి, క్రమం తప్పకుండ వైద్య పరీక్షలు చేయించుకోవాలి, రోజూ వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం అలవర్చుకోవాలని చెప్పారు.

**నివారణ సూచనలు**

- ప్రతి ఒక్కరు రక్తపోటు, షుగరు, కొలెస్ట్రాల్‌ను కాలానుగుణంగా (ఉదా: సంవత్సరానికి ఒకసారి) పరీక్షించుకోవాలి.
- ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు మితమైన వ్యాయామం చేయాలి.
- పండ్లు, కూరగాయలు, ధాన్యాలు అధికంగా ఉండే, ఉప్పు, ట్రాన్స్-ఫ్యాట్స్, ప్రాసెస్ చేసిన ఆహారం తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- ధూమపానం మానుకోవాలి, ఒత్తిడిని (స్ట్రెస్) నియంత్రించాలి.
- ఛాతి నొప్పి, ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి హెచ్చరిక సంకేతాలను గుర్తించి వెంటనే వైద్య సహాయం పొందాలి.

# మందుల్లో మతలబు..

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. కానీ ఆ ప్రయోజనం వినియోగదారుడికి అందడం లేదు. గ్లూకో మీటర్, టెస్ట్ స్ట్రిప్‌లు, థర్మామీటర్లు, డయాగ్నోస్టిక్ కెమికల్స్, కిట్‌లు, ఇతర మందులపై జీఎస్టీ 18/12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినా జిల్లాల్లో మాత్రం ఆచరణలో అమలుచేయడం లేదని సమాచారం.

**ప్రైవేటు ఆసుపత్రుల షాపుల్లో ఆగని దోపిడీ..**

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుసంధానంగా నడుస్తున్న మెడికల్ షాపుల్లో ఎమ్మార్పీనే అమలు చేస్తున్నారు. బయట రిటైల్ మెడికల్ షాపుల్లో 20 శాతం డిస్కౌంట్ ఇస్తుండగా, ఆసుపత్రుల్లో ఉండే షాపుల్లో అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఆసుపత్రుల్లో షాపులకు జీఎస్టీ వర్తించదంటూ తేల్చిచెప్పి ముద్రించిన ధరలకే మందులు అమ్ముతూ కోట్లు దండుకుంటున్నారు. ఆసుపత్రుల్లో మెడికల్ షాపుల వ్యవహారం పరిశీలిస్తే మందుల తయారీ కంపెనీల ప్రతినిధులు డాక్టర్‌ల దగ్గరకు వెళ్లి తమ ఉత్పత్తుల గురించి ప్రచారం చేయడం సాధారణమై పోయింది. ఆయా మందుల వినియోగాన్ని బట్టి వారికిచ్చే వాటాలు ఆధారపడి ఉంటాయి. కాగా తయారీ సమయంలో ఒక మందు తయారీకి రూ.5 ఖర్చు అయితే, కొనుగోలుదారుడు వద్దకు వచ్చేసరికి దాని ధర రూ.150కి చేరుతోందని చెబుతున్నారు. వాస్తవానికి ప్రిస్క్రిప్షన్‌లో మందు పేరు రాయాలనే నిబంధనను పూర్తిగా తుంగలో తొక్కేశారు. మరోవైపు యాంటిబయాటిక్స్ వినియోగం తగ్గించాలని డాక్టర్లు చెబుతున్నా, మెడికల్ షాపుల్లో మాత్రం రోగం మందుతోపాటు యాంటిబయాటిక్ వాడాల్సిందే అంటూ అంటగట్టేస్తున్నారు.

**ప్రజల్లో అవగాహన లోపం..**

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో దాదాపు చాలా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన మందులకు బిల్లు ఇవ్వడం లేదు. దీంతో జీఎస్టీ ఎంత వర్తిసుంది అనే విషయంలో ప్రజల్లో అవగాహన లోపిస్తుంది. బిల్లు ఇవ్వకపోవడంపై వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. దీంతో మెడికల్ షాపుల దోపిడీ మరింత పెరిగింది. మందులపై జీఎస్టీ తగ్గిందన్న విషయాన్ని వ్యాపారులు బోర్డుల ద్వారా అవగాహన కల్పించడం లేదు. ఇప్పటికైనా మెడికల్ షాపుల్లో అమలు కాని తగ్గింపు జీఎస్టీపై అటు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఇటు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యానికి రక్ష

(మొదటి పేజీ తరువాయి)

అత్యాధునిక కార్పొరేట్ వైద్య పరీక్షలు, నిపుణులైన వైద్యుల పరిశీలన, అవసరమైన మందులు ఉచితంగా అందించడం, తదుపరి వైద్య సేవలు అవసరం అనుకుంటే చేయిం చడమే మెగా హెల్త్ క్యాంప్ లక్ష్యమన్నారు.



వార్డుల వారీగా కార్మికులను క్యాంప్‌కి తీసుకురావడం, వైద్య పరీక్షల అనంతరం ఇంటికి తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా బస్ లను ఏర్పాటు చేసి, అధికారులకు విధులు కేటాయించామన్నారు. షుమారు 3 వేల మందికి క్యాంప్ ద్వారా చికిత్స, వైద్య పరీక్షలు చేయడానికి ముందుకు వచ్చిన ఐఎంఏ బృందానికి గుంటూరు నగరపాలక సంస్థ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు బి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు జిఎంసి మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. అలాగే కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల కష్టం లేనిదే నగరం పరిశుభ్రంగా ఉండదన్నారు. కనుక వారికి స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతొ వారు చేసే పనికి ప్రధాని కూడా అధిక ప్రాధ్యానత కల్గించారన్నారు. ఐఎంఏ గుంటూరు ప్రెసిడెంట్ డాక్టర్ వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడే ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యం మెరుగుపరచడానికి ఐఎంఏ పూర్తీ సహకారం అందిస్తుందన్నారు. మెగా హెల్త్ క్యాంప్ లో అత్యంత విలువైన వైద్య పరీక్షలు, మందులు కూడా ఉచితంగా చేయడానికి హాస్పిటల్స్ ముందుకు వచ్చాయన్నారు. క్యాంప్ లో ఎవరికైనా తీవ్ర అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వారికి తదుపరి చికిత్స అందించడానికి ఐఎంఏ తరుపున సహకరిస్తామని తెలిపారు.అనంతరం హెల్త్ క్యాంప్ లో పాల్గొన్న వైద్యులకు నగరపాలక సంస్థ నుండి మేయర్, కమిషనర్లు షీల్డ్ లు బహుకరించారు. కార్యక్రమంలో ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అమర లింగేశ్వరరావు, సెక్రెటరి డాక్టర్ సాయి కృష్ణ, జాయింట్ సెక్రెటరి డాక్టర్ చంద్ర రాధికారాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ ఈ.కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ జి.శివరామకృష్ణ, డాక్టర్ బి.అప్పారావు, జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ(ఇంచార్జి) రామారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ప్లాస్టిక్ నిషేధ అవగాహన ర్యాలీ

**– ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని ప్రజల్లో ప్రచారం చేసేందుకు నరసరావుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన మార్గాల్లో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, ఎన్‌జీఓ సభ్యులు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మున్సిపల్ ఆఫీసు వద్ద నుంచి ప్రారంభమై, ప్రధాన వీధుల గుండా సాగి మళ్లీ మున్సిపల్ ఆఫీసులో ఆగిపోయింది. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, మట్టి ఫలవంతతకు, జీవవైవిధ్యానికి కలిగించే హానుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ప్లాస్టిక్‌కు బదులు కాగితం, లోహాలు, క్లాత్ వంటి పర్యావరణ అనుకూల పదార్థాలను వాడాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. "ప్లాస్టిక్ వస్తువులు మన పర్యావరణానికి హాని కలిగించే విషం. ఇవి మన మట్టిని, నీటిని, గాలిని కలుషితం చేస్తున్నాయి. మన నరసరావుపేట పట్టణం ఈ రోజు ప్లాస్టిక్ వ్యర్థాలతో మారిపోతోంది. ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీ నుంచి ప్రేరణ పొంది, తమ రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలి. మనం కలిసి ప్లాస్టిక్ రహిత పట్టణాన్ని నిర్మించాలి. ఇది కేవలం మున్సిపాలిటీ బాధ్యత కాదు, ప్రతి పౌరుని బాధ్యత" అని ప్రజలను చైతన్యవంతులను చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో జూలై 2025 నుంచి ప్రారంభమైన ప్లాస్టిక్ నిషేధ పోరాటంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహణ జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించినట్టు అక్టోబర్ 2 నుంచి 17 మున్సిపల్ కార్పొరేషన్లలో పూర్తి నిషేధం అమలవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ సిబ్బందితో పాటు ఉమ్మడి కూటమి నేతలు పాల్గొన్నారు.

# వేద పారాయణ హిందూ సాంప్రదాయంలో ఎంతో పవిత్రమైంది

**– హిందూ ధర్మ పరిరక్షణకు సమాఖ్య సేవలు అభినందనీయం**

**– టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపల్ శివ సుబ్రహ్మణ్య అవధాని**



**తెనాలి, మేజర్ న్యూస్ :** వేద పారాయణ హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైనదని అది ఒక ధార్మిక ఆచారబంధమైనదని తద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మశ్రీ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని పేర్కొన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెనాలి నాజరుపేటలోని వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య భవనంలో బ్రహ్మశ్రీ సామవేదం సత్య నారాయణ ఆధ్వర్యంలో వేద పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఘనపాటి విష్ణుభట్ల ఆంజనేయ చైనులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్య అవధాని మాట్లాడుతూ వేద పారాయణ ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరగటంతో పాటు శుభ ఫలితాలు లభిస్తాయి అన్నారు. నెగిటివ్ ఎనర్జీ తొలగి మంచి వాతావరణం ఏర్పడుతుందని, సంపద ఆరోగ్యం శాంతి ఐశ్వర్యాలు కలుగుతాయి అన్నారు. దైవ అనుగ్రహం కూడా సంపూర్ణంగా లభిస్తుందని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ వేదపారాయణను గురువు మార్గదర్శకంలో చేస్తే గొప్ప ఫలితాలు లభిస్తాయన్నారు. 50 మంది వేద పండితులు వేద పారాయణ నిర్వహించారు. అనంతరం సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో పండితులను ఘనంగా సన్మానించారు. సమాఖ్య పాలకవర్గాన్ని పండితులు ముక్తకంఠంతో వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కుందేటి సుబ్రహ్మణ్యం, తిరుమలరావు కామేశ్వర రావు, నారాయణ వేణుగోపాల్, అనిల్ కుమార్, మేడూరు శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, పొనుగుపాటి వెంకటేశ్వర్లు, టీ నాగ సుబ్రహ్మణ్యం, తాడేపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఏకగ్రీవంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ బొల్లాపల్లి మండల అధ్యక్షుడు



**బొల్లాపల్లి మేజర్ న్యూస్ :** వినుకొండ నియోజకవర్గం లోని బొల్లాపల్లి మండలం విశ్వబ్రాహ్మణ బొల్లాపల్లి మండల ఎన్నికల నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలో ద్రోణాదుల మల్లికార్జున చారిని అధ్యక్షుడిగాను నెమలి కొండ శేషయ్య చారిని సెక్రెటరీగాను ట్రెజరరీగా ధూళిపాల నాగ సుబ్రహ్మణ్య చారి ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశం విశ్వబ్రాహ్మణులు ఈరోజు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. ఎందుకు ఎనకబడి ఉన్నారు అనటానికి ఏకైక కారణం రాజకీయ అవగాహన లేకపోవడం వల్ల అదే విధంగా ఇలాంటి రాజకీయ అవగాహన ఏర్పాటు చేయడం కోసం విశ్వబ్రాహ్మణులు సంఘటితం కావాలని ఇప్పటికైనా ఊర్లలో విశ్వబ్రాహ్మణుల ఉన్న సమస్యల పరిష్కారానికై అందరూ ఏకం కావాలని అధ్యక్షుడు తెలియజేశారు ముఖ్య అతిథులుగా విశ్వబ్రాహ్మణ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి దికొండ వెంకటాచారి ఉలవలపూడి రాము నాగేశ్వరరావు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోతుడక వీరాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ మండల కమిటీ వేయడం చాలా ఆనందదాయకంగా ఉంది అదేవిధంగా ఇలా అన్ని మండలాలలో కమిటీలు వేయటం ద్వారా ఆ మండలాలలో కమిటీలో ఉన్న అధ్యక్షుల్ని సెక్రెటరీ నియోజకవర్గం కమిటీలుగా వేస్తామని ఆ కమిటీలో విశ్వబ్రాహ్మణులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఒడిదుడుకులు ఉన్న మాకు తెలియజేస్తే మేము వాటిని సాల్వ్ చేయడానికి ఎలాంటి సమయం లోనైనా సరే ముందుంటామని కొనియాడారు అదేవిధంగా వెంకటాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం గత కొన్నేళ్లుగా బొల్లాపల్లి మండలంలో మండల కమిటీలు వేయటం లేదని ఇప్పటికైనా సరే మండల కమిటీల ద్వారా పేద విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందరికీ అందే విధంగా చేయడంలో సహాయపడతావని పేద విశ్వబ్రాహ్మణులకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని కొనియాడారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మంచి శేషగిరి వైస్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి భ్రమరాచారి ఉపాధ్యక్షుడు దువ్వూరి సత్యనారాయణ చారి గౌరవాధ్యక్షులు అంగలకుదురు గోవింద ఆచారి గౌరవ సలహాదారులు నెమలికొండ శివ నారాయణ చారి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉలవపాటి పెద్దబాలోని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వినుకొండ శ్రీనివాస చారి కోటిలింగా చారి శివన్నారాయణ చారి చిన్నబ్రహ్మరాచారి త్రిపుర చారి శ్రీనివాసాచారి లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి సేవాసమితి వేడుకలు

**– 500 ల పర్యావరణహిత సంచుల పంపిణీ**



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :**

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కొణిజెటి రోశయ్య స్థాపించిన వాసవి సేవా సమితి 30 వసంతాల వేడుకల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోశయ్య 92వ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ 5000 సంచులు పంపిణీ కార్యక్రమం జరిగినది.. పల్నాడు జిల్లా వాసవి సేవా సమితిల సమాఖ్య పరంగా మీడియా కన్వీనర్ గా అయినవోలుకోటేశ్వరరావు ను వ్యవస్థాపకులు చీతిరాల గురు పెద్దన్న నియమించడమైనది.

ఈ కార్యక్రమమునకు సహకరించిన వారు కొల్లిపర కాశీ విశ్వనాథం , కొప్పు రావూరి చిన్న కనకయ్య, అవుతూ నారపరెడ్డి, మరియు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆతుకూరి చిన్న బాబు, వాసవి సేవా సమితి అధ్యక్షులు దేవరశెట్టి రవి, కూకట్ల శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, పెరుమళ్ళ శ్రీమన్నారాయణ, కట్టమూరు అప్పారావు, కటకం సాయి రమేష్, విశ్వేశ్వరరావు, పోతు గంటి నరసింహారావు, కొప్పురావూరి కాశి మరియు పట్టణ పుర ప్రముఖులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినందుకు ధన్యవాదములు తెలియ చేయడమైనది.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :**

ఉచిత వైద్య శిబిరాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని బృందావన్ గార్డెన్స్ వద్ద గల పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ నందు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.



# విద్యతోనే కురుబల ఉన్నతి సాధ్యం

**– అమరావతిలో భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి**

**– సీఎం చంద్రబాబుతోనే కురుబలకు మేలు**

**– వచ్చే నెల 5న తిరుపతి భక్త కనకదాస విగ్రహావిష్కరణ**

**– రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**– మంగళగిరిలో కురుబ, కురువ, కురుమ రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టంచేశారు. ఐక్యమత్యంతో కురుబలు మెలగాల్సిన అవసరముందన్నారు. అమరావతిలో భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరిలో ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కురుబ, కురువ, కురుమ సామాజిక వర్గీయుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయుంతా ఒక్కటేనని, వారంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరమవుతుందని, అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధ్యమవుతుందని తెలిపారు. కురుబ, కురుమ, కురువ పేద విద్యార్థులకు అండగా నిలుద్దామని, అందుకు తాను వ్యక్తిగతంగా ఎల్లవేళలా సాయమందిస్తానని తెలిపారు.

**అమరావతిలో కనకదాస విగ్రహం :**



అమరావతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇదే విషయమై సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. తిరుపతిలో భక్త కనకదాస పీఠం ఏర్పాటుపైనా సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. వచ్చే నెల అయిదో తేదీన తిరుపతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నామని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

**చంద్రబాబుతోనే కురుబలకు మేలు :**

సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతోనే కురుబలకు ఎంతో మేలు కలుగుతోందని మంత్రి సవిత తెలిపారు. కురుబల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఆయన ఎంతగానో వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. కురుబలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఎంపీలుగానూ, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా సేవచేస్తున్నట్లు తెలిపారు. ఇదంతా సీఎం చంద్రబాబు వల్లేనన్నారు. గత ఎన్నికల్లో కురుబలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కురుబలను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తిరుపతిలో వచ్చే నెల 5న జరిగే భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వివిధ జిల్లాలకు చెందిన కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నంబూరు జడ్పీ హైస్కూల్
# పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ఎన్నిక చెల్లదు

**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల శ్రీ ప్రోలయ్య వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నూతన ఎన్నిక చెల్లదని సంఘం మాజీ చైర్మన్ మందాళ్ళ వీరారెడ్డి పేర్కొన్నారు ఆదివారం నంబూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల సిల్వర్ జూబ్లీ ప్లాటినం ఫంక్షన్ నిర్వహించుటకు పాఠశాల పూర్వ విద్యార్థులంతా కలిసి 2022లో సంఘంగా ఏర్పడ్డామని సంఘానికి ఈమనీ ప్రతాపరెడ్డిని అధ్యక్షులుగా నంబూరు నాగేశ్వర రావును ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల నుండి నంబూరు గ్రామస్తుల నుండి సుమారు 44 లక్షలు విరాళాలు సేకరించి సిల్వర్ జూబ్లీ ప్లాటినం ఫంక్షన్ను విజయవంతం చేసామని తరువాత మిగిలిన 12 లక్షలతో పాఠశాల ఆవరణలో సిల్వర్ జూబ్లీ ప్లాటినం భవనం ఏర్పాటుకు నిర్ణయించామని అయితే భవన నిర్మాణానికి 42 లక్షలు అవసరం అవుతాయని తిరిగి విరాళాలు సేకరించడం జరిగిందని భవన నిర్మాణం పూర్తయ్యే నాటికి 52 లక్షలు అయినట్లు పేర్కొన్నారని



అదనంగా వచ్చిన విరాళాల నగదు సుమారు 12 లక్షలు కమిటీ పేరిట జాయింట్ అకౌంట్లో బ్యాంకులో ఉన్నాయని అయితే అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఇప్పటివరకు నిధులకు సంబంధించి ఎలాంటి లెక్కలు చెప్పలేదని వసూలు అయిన విరాళాలు దుర్వినియోగమైనట్లు తమ దృష్టికి వచ్చినట్లు అలాగే విరాళాలు సేకరించి సమయంలో కొన్ని దొంగ రసీదులు కూడా దాతలకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు కమిటీ బైలా ప్రకారం అందరిని సమావేశ పరిచి నూతన కమిటీని ఎన్నుకోవాల్సి ఉండగా రహస్యంగా ఎవరికి తెలియకుండా కమిటీలో లేని వారిని కొంతమంది చేర్చుకొని నూతన కమిటీతో ఏర్పడ్డామని ప్రకటించారని అయితే ఈ కమిటీ చెల్లదని దీనిపై న్యాయపరమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు కమిటీ పేరిట ఉన్న బ్యాంకులోని నిధులు దుర్వినియోగం కాకుండా లాయర్ ద్వారా బ్యాంకుకు సబ్ రిజిస్ట్రార్కు లీగల్ నోటీసులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు పాఠశాల పూర్వ విద్యార్థుల నుండి నంబూరు గ్రామస్తుల నుండి సుమారు కోటి రూపాయల వరకు నిధులు సేకరించిన ఈ కమిటీ ఇప్పటివరకు గ్రామస్తులకు కానీ కమిటీలోని సభ్యులకి గాని ఎలాంటి లెక్కలు చూపి లేదని తెలిపారు కార్యక్రమంలో కమిటీ సలహాదారులు సయ్యద్ సుభాని శనగల సీనమ్మ గుజ్జల బసంతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు
**– ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా**





**పిడుగురాళ్ళ మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలో విశ్వకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పల్నాడు బలహీన వర్గాల ఐక్యవేదిక అధ్యక్షులు మరియు టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి దాచేపల్లి నగర పంచాయతీ ఇండిపెండెంట్ కౌన్సిలర్ షేక్ షరీఫ్, దేగల అబ్రహం, పిల్లి చెన్నారావు, సంపత్ యాదవ్, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, పల్నాడు బలహీన వర్గాల ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ : పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



**మాచర్ల మేజర్ న్యూస్ :**

మాచర్ల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న కష్టాలు, బాధలు, కూటమి ప్రభుత్వం పెట్టే ఇబ్బందులను ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని విమర్శించారు. "రేపు జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ట్రాన్స్ఫర్ అయినా, రిటైర్డ్ అయినా, వారిని వదిలే ప్రసక్తి లేదు. న్యాయపరంగా శిక్షించేందుకు ఈ డిజిటల్ బుక్ కీలకంగా ఉపయోగపడుతుంది" అని పిన్నెల్లి స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాడుతూ కూటమి ప్రభుత్వం నుంచి వేధింపులకు గురవుతున్న కార్యకర్తలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. "ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి. మీ తరఫున పార్టీ నిలబడుతుంది, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంది" అని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

# దుగ్గిరాలలో ఘనంగా గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలో గుర్రం జాషువా 130 వజయంతి వేడు కలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెట్టి బాలరాజు, ఎన్. యోగేశ్వరరావు. లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలరాజు మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారని సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించారన్నారు. గుర్రం జాషువా రచించిన గబ్బిలం , పిరదౌసి క్రీస్తు చరిత్ర రచనలు బాగా ప్రాచుర్యం పొందాయని అన్నా రు. 1964 లో శాసన మండల సభ్యులుగా పని చేశారని, కేంద్ర ప్రభుత్వం నుండి పద్మభూషణ్ అవార్డుతో గౌరవ పురస్కారం పొందా రని తెలిపారు. జాషువా ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈకార్యక్రమంలో సురేష్ బాబు, మనోహర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



# జంట హత్యల కేసు - దారి ఎటు..?

**– మాచర్ల పోలీస్ స్టేషన్‌లో పిన్నెల్లి సోదరుల విచారణ పూర్తి..?**
**– కేసులో విచారణలో నిఖార్సైన ప్రశ్నలు.??**
**– అభివృద్ధి జపం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి..!**
**– న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలు**

**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జవిశెట్టి సోదరుల జంట హత్యల కేసు మరోసారి మాచర్ల రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తోంది. ఇటీవల ఈ కేసులో ఏ6, ఏ7 నిందితులుగా పేర్కొన్న పిన్నెల్లి సోదరులు – మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి – మాచర్ల పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

**విచారణలో మలుపులు..!**

పోలీసుల ప్రశ్నలు గంటల తరబాటు కొనసాగాయి. రామకృష్ణారెడ్డికి సుమారు 170 ప్రశ్నలు, వెంకటరామిరెడ్డికి 180 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఫోన్ కాల్స్, సిగ్నల్ రికార్డులు, ఇతర నిందితులతో ఉన్న సంబంధాలు వంటి అంశాలపై విచారణ జరిగింది. అయితే, వీరిద్దరూ తరచూ "తెలియదు", "గుర్తు లేదు", "సంబంధం లేదు" అన్న సమాధానాలకే పరిమితమైందని తెలుస్తోంది. ప్రస్తుతం విచారణ అనంతరం వారిని విడుదల చేసినప్పటికీ, మరోసారి పిలిచే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. హైకోర్టులో బైల్ ఉపసహాయంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో నిందితులు టీడీపీ పార్టీకి చెందిన వారే, చనిపోయింది టిడిపి పార్టీకి చెందిన వారే అని ఈ జంట హత్యలతో మాకేం సంబంధం అని వైసిపి వర్గాలవారు విమర్శిస్తున్నారు.

**న్యాయం కోసం ఎదురుచూపు..?**

ఈ కేసు ప్రారంభమైన నాటి నుండి బాధిత కుటుంబాలు న్యాయం కోసం నిరీక్షణలో ఉన్నాయి. రాజకీయ ప్రతీకారమే ఈ ఘటనకు మూలం అని వారు పదేపదే వాదిస్తున్నారు. కఠినమైన శిక్షలు అమలు చేసి, నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని కోరుతున్నారు.

**అభివృద్ధి జపం చేస్తున్న జూలకంటి..!**

ఇదే సమయంలో మాచర్ల ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాత్రం హత్య రాజకీయాల మధ్యలోనూ తన దృష్టిని అభివృద్ధిపైనే కేంద్రీకరించారు. త్రాగు నీరు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, జాబ్ మేళాలు, వంద పడకల ఆసుపత్రి వంటి ఎన్నో కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఇటీవల స్వర్ణాంధ్ర %–% స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో ఆయన "కార్యకర్తలు సంయమనం పాటించాలి, రాజకీయ ద్వేషాలను పక్కన పెట్టాలి" అని స్పష్టం చేశారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ..!**

ఒక వైపు హత్య కేసు విచారణ మెల్లగా సాగుతుండగా, మరో వైపు అభివృద్ధి పథకాలతో ఎమ్మెల్యే జూలకంటి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. పార్టీ కార్యకర్తల్లో కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నా, మరికొందరు ఆయన ఆలోచన శైలిని అర్థం చేసుకొని అనుసరిస్తున్నారు.

**తుదిపరిణామం..?**

జంట హత్యల కేసు ఇప్పుడు పొలిటికల్ పవర్ గేమ్ కంటే ఎక్కువగా న్యాయం కోసం పోరాటంగా మారింది. ఒక వైపు పోలీసు విచారణలో నిందితుల వాఖ్యలు, మరో వైపు అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే జూలకంటి కట్టుబాటు – ఈ రెండూ మాచర్ల ప్రజల్లో చర్చనీయాంశాలుగా మారాయి. కేసు ఎటు దారి తీస్తుందో, న్యాయం ఎప్పుడు లభిస్తుందో అన్న ప్రశ్నకు సమాధానం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.




# కవి గుర్రం జాషువాకు నివాళులర్పించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మొక్కెన



**ఈపూరు మేజర్ న్యూస్ :**

కవి కోకిల, పద్మభూషణ్ శ్రీ గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా వినుకొండ పట్టణంలోని గుర్రం జాషువా కళాప్రాంగణ ఆవరణలో ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు జాషువా గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీ గారు మాట్లాడుతూ, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప కవులలో జాషువా గారొకరని కొనియాడారు. జాషువా గారి రచనలు, ముఖ్యంగా 'గబ్బిలం', 'ఫిరదౌసి' వంటి కావ్యాలు సమాజంలోని అసమానతలను, అణచివేతను ప్రశ్నిస్తూ సామాజిక స్పృహను పెంచాయని తెలిపారు. కవిత్వంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ లిమక్కెన మల్లికార్జున రావు అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి నాదెండ్ల

**తెనాలి, మేజర్ న్యూస్ :**

కొల్లిపర మండలంలోని ముంపు ప్రాంతాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పర్యటించారు. బొమ్మువానిపాలెంలో అధికారులతో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ నుండి దిగువ ప్రాంతాలకు భారీగానే నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటి విడుదల ఆదివారం రాత్రికి ఏడు లక్షల క్యూసెక్కుల విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. నీటి విడుదల ఎనిమిది లక్షల క్యూసెక్కులకు దాటితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కృష్ణా నదీ పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వంతో పాటు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.



## ఘనంగా అనుగురాజు యాదవ్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొలుసు పార్ధసారధి ఎమ్మెల్యే యరపతినేని**



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:** పట్టణంలోని గంగమ్మ గుడి దేవస్థాన ప్రాంగణం నందు 11వ శతాబ్దంలో అఖండ పల్నాడును స్థాపించి పరిపాలించిన రాజు అనుగురాజు యాదవ్ విగ్రహా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణ మూర్తి, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య యాదవ్, రాష్ట్ర పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ డా. నూకసాని బాలాజీ, రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గోళ్ళ నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## లలిత పీఠంలో శర్మాజీ విశేష పూజలు



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు నగర శివారు చౌడవరం శ్రీ లలిత పీఠంలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పీఠం వ్యవస్థాపకులు మేళ్లచెరువు సుబ్రహ్మణ్య శర్మ (శర్మజీ) ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రతిరోజు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు అమ్మవారికి శ్రీ చక్రార్చన, కుంకుమార్చన, లలితా సహస్రనామం పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శర్మజీ తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన శ్రీ మహంకాళి అమ్మవారు

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :**



దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారు ఆదివారం శ్రీ మహాలక్ష్మి దేవి గాభక్తులకు దర్శన మి చ్చారు .దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం శ్రీ మహంకాళి అమ్మవారు. మహాలక్ష్మి దేవిగా దర్శనమివ్వడంతో భక్తులు ప్రజలు ,అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## క్రైస్తవ సమాధుల స్థలాలు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



**తెనాలి, మేజర్ న్యూస్ :** క్రిస్టియన్ సమాధులు తోట దురాక్రమణలకు గురౌతున్నాయని, సమాదులకు మరోచోట స్థలాన్ని కేటాయించాలని బిఎస్పి తెనాలి నియోజకవర్గ ఇంచార్జి కారుమంచి సునీల్ సందీప్ పేర్కొన్నారు. ఆదివారం ఐతానగర్ క్రైస్తవ సమాదుల వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు కేటాయించిన సమాదులతోట దూరాక్రమనలకు గురవడంతో మృతదేహాలు భూస్థాపన చేయడానికి స్థలం కొరత ఏర్పడుతుందని ఆరోపించారు. స్వయంగా తన పితరుల సమాధులు దూరా క్రమనలకు గురైనట్లు ఐతానగర్ ప్రాంతానికి చెందిన గెడ్డటి ప్రకాష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమాధులను కళ్లారా చూసుకోలేని దుస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గడ్డటిప్రకాష్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెనాలి ప్రాంతానికి చెందిన డాక్టర్ దర్శి జీవనలత సమాదుల స్థలాన్ని అక్రమించినట్లు పిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకొంటామన్ని సి.ఐ రాములు నాయక్ చెప్పారని ప్రకాష్ తెలిపారు.

క్రిస్టియన్ సమాదులతోట కు స్థలాన్ని కేటాయించాలని గత ప్రభుత్వాలను కోరినా ఫలితం లేదని, ప్రస్తుతం సమాధులు కట్టడాలు పెరగడంతో సమాధులు స్థలం కరువైందని తెనాలి బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి తెనాలి ఆనంద్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో గెడ్డటి జ్ఞానరాజు, బొనిగల ప్రదీన్, కోండ్రు రాజు, కొమ్ము వర్మ, కంచర్ల సుమంత్, పిల్లి క్రాంతి, కొప్పుల అనిల్, బోనిగల ప్రవీణ్ తదితరులు పాల్గున్నారు.

## ఆటో డ్రైవర్ల సేవలో

**– ఏపీ కూటమి ప్రభుత్వం కొత్త ఆర్థిక సహాయ పథకానికి శ్రీకారం**

**– అక్టోబర్ 4న అమలు**




**పల్నాడు జిల్లా ప్రతినిధి, నేటి దినపత్రిక సూర్య:** ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అక్టోబర్ 4న "ఆటో డ్రైవర్ల సేవలో" అనే కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వాహన మిత్ర' పథకాన్ని పేరు మార్చి, ఈ కొత్త పేరుతోనే కొనసాగించనుంది. ఈ పథకం ద్వారా ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 15,000 ఆర్థిక సహాయం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటీ) పద్ధతితో ఒకేసారి జమ చేయబడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.90 లక్షల మంది లబ్ధిదారులకు ఈ సహాయం అందనున్నట్లు ఇటీవల ఏపీ శాసనసభ సమావేశాల్లో క్యాబినెట్ తీర్మానించింది. ఈ పథకానికి ఏటా రూ. 435 కోట్లు ఖర్చు అవుతుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ పథకం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన నిర్వహణ, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి ఖర్చులకు ఉపశమనం కల్పిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో రూ. 10,000 నుంచి రూ. 12,000 వరకు సహాయం అందించగా, కొత్త ప్రభుత్వం దీన్ని రూ. 15,000కి పెంచింది. "ఇది మా మ్యానిఫెస్టో వాగ్దానాల్లో భాగం. పేదల సేవకు నా జీవితాన్ని అర్పించుకుంటాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభలో ప్రసంగిస్తూ చెప్పారు. పథకం ప్రారంభానికి ముందుగానే సెప్టెంబర్ 17 నుంచి 19వం–కు దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. లబ్ధిదారుల జాబితా సెప్టెంబర్ 24న జీఎస్‌డబ్ల్యూఎస్ (గ్రామ సేవలర వార్డ్ సేవలర్ వెల్ఫేర్ స్కీమ్) పోర్టల్‌లో ప్రచురించబడింది. దరఖాస్తుదారులు తమ ఆధార్ నంబర్‌తో వెబ్‌సైట్‌లో స్థితిని తనిఖీ చేసుకోవచ్చు.

**పల్నాడు జిల్లాలో :**

పల్నాడు జిల్లా, గుంటూరు జిల్లా నుంచి 2022లో విభజించబడి ఏర్పడిన ఈ జిల్లాలో ఆటో–క్యాబ్ డ్రైవర్ల సంఖ్య దాదాపు 12,000 మంది ఉన్నారు. నరసరావు పేట, సత్తెనపల్లి, గురజాల వంటి మండలాల్లో ఎక్కువగా



ఉన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు డేటా ప్రకారం 2025 నాటికి రిజిస్టర్డ్ ఆటోలు 8,500, క్యాబ్‌లు 3,200. ఈ డ్రైవర్లలో 40శాతం బీసీ లు, 25శాతం ఎస్సీ వర్గాల నుంచి. "ఆటో డ్రైవర్ల సేవలో" పథకం ద్వారా జిల్లాలో 10,500 మంది అర్హులుగా ఉన్నారు. , వీరికి రూ. 15.75 కోట్లు జమ కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల లోపాలు, ఇంధన ధరల పెరుగుదల వంటి సమస్యలతో డ్రైవర్లు కష్టపడుతున్నారు. ఉదాహరణకు నరసరావుపేట మండలంలో 4,500 మంది డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేశారు, కానీ 200 మంది డ్రైవింగ్ లైసెన్స్ అప్‌డేట్ సమస్యతో తిరస్కరించబడ్డారు. పల్నాడు జిల్లా అధికారులు "పథకం ప్రారంభానికి ముందు వార్డ్ సచివాలయాల్లో అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్లు తమ ఆధార్, ఆర్‌సి బుక్, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు సరిగ్గా అప్‌లోడ్ చేసుకోవాలి." జిల్లాలో ఫ్రీ బస్ స్కీమ్ ప్రభావంతో డ్రైవర్ల ఆదాయం 20–25శాతం తగ్గింది. ఈ సహాయం వారికి దసరా పండుగ సమయంలో ఊరట కల్పిస్తుందని స్థానిక ఆటో యూనియన్ నాయకుడు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా :**

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 2,90,234 మంది ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఈ పథకానికి అర్హులు. వీరిలో ఎక్కువ మంది తక్కువ ఆదాయ వర్గాలకు చెందినవారు. రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ డేటా ప్రకారం 2025 నాటికి రిజిస్టర్డ్ ప్యాసింజర్ వెహికల్స్ (ఆటో, టాక్సీలు) సంఖ్య 3.5 లక్షలకు పైగా ఉంది. గత ఏడాది కోవిడ్ తర్వాత ఇది 15 శాతం పెరిగింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ), బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (బీసీ) నుంచి వచ్చే డ్రైవర్లు లబ్ధిదారుల్లో 60శాతం కు పైగా ఉన్నారు. పథకం ద్వారా రూ. 435 కోట్లు డిబిటీ ద్వారా ప్రత్యక్షంగా ఖాతాల్లోకి వెళ్తాయి, ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం ఇస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,90,234 మంది కి రూ. 435 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలు 1,74,140 మంది (60శాతం) ఉన్నారు. వీళ్ళకి రూ. 261 కోట్లు ఖర్చవుతుంది. మహిళలు 1,00,000 మంది (35శాతం) ఉన్నారు. వీళ్ళకి రూ. 150 కోట్లు ఖర్చవుతుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని డ్రైవర్లకు మాత్రమే కాకుండా, పల్నాడు లాంటి గ్రామీణ జిల్లాల్లో ఆర్థిక స్థిరత్వం వస్తుందని నిపుణులు అంచనా ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని "సూపర్ సిక్స్" కార్యక్రమాల్లో భాగంగా ప్రకటించారు, ఇది కూటమి ప్రభుత్వం వాగ్దానాల అమలిలో మరో మైలురాయిగా నిలిచింది.

## ఆకస్మిక తనిఖీ

**– జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** గుంటూరు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాత గుంటూరు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్లలోని పలు రికార్డుల పరిశీలించారు. పెండింగ్లో ఉన్న కేసులు వెంటనే త్వరిత గతిన పూర్తిచేయాలని సీఐ వెంకట ప్రసాద్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాల జారీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రత, భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే పోలీస్ సిబ్బందితో వారి విధుల నిర్వహణ పై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి, ఎప్పటికప్పుడు క్రమపద్ధతిలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు స్వేచ్ఛగా చెప్పుకునేలా స్టేషన్లలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సిఐ వెంకటప్రసాద్ కు తెలిపారు . విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని పటిష్టపరచి, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ బస్టాండు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్బి సీఐ శ్రీ అలహరి. శ్రీనివాస్, ఎస్సైలు ప్రసాద్ , రెహమాన్ , వెంకటేశ్వర్లు , ఏఎస్సై శ్రీకాంత్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఎస్పీని కలసిన పదోన్నతి పొందిన ఏఎస్ఐలు

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :** హెడ్ కానిస్టేబుళ్ల నుండి ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన 06 మంది ఆదివారం జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్ని మర్యాద పూర్వకంగా కలసినారు. జ్ఞాపికను అందించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది. సుదీర్ఘ అనుభవాన్ని, తెలివి తేటలను ఉపయోగించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు ప్రత్యేక చొరవ చూపాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగోన్నతి పొందటం అనేది ప్రతి ఉద్యోగికి ఒక గౌరవం. ఆ గౌరవాన్ని కాపాడుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన రీతిలో విధులు నిర్వహించి జిల్లా పోలీస్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన M.వర కుమార్, Ch.పుల్లారావు, A.సాంబశివ రావు, రవి, M.సత్యనారాయణ, ఎస్‌కె. శంషుద్దీన్, తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

## బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన జాషువా

**– జాషువాకు నివాళులర్పించిన మన్నవ**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** తెలుగు సాహిత్యలోకంలో దిగ్గజ కవికోకిల గుర్రం జాషువా 130 వ జయంతి సందర్భంగా గుంటూరు నగరం పాలెంలోని గుర్రం జాషువా విగ్రహానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... తన జీవిత పర్యంతం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానీయుడు అని అన్నారు. తన కవితల ద్వారా సమాజంలో సమానతులను రూపుమాపడానికి అహర్నిశలు శ్రమించారన్నారు. కవితల ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించిన ఈ మహానీయుడుకు స్ఫూర్తిదాయకం అన్నారు. గుర్రం జాషువా నేటి యువతరానికి ఆదర్శ దాయకమని మన్నవ మోహనకృష్ణ అన్నారు.

## శాంకరీ మాతకు జేజేలు



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** గుంటూరు మండలం లాలు పురం గ్రామంలోని శ్రీ శాంకరిమాత ఆలయంలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుపుతున్నారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు. ఆలయం పరిసర ప్రాంతాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో కనువిందు చేస్తోంది.

## గుర్రం జాషువా జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే బొల్ల



**ఈపూరు మేజర్ న్యూస్ :** వినుకొండ పట్టణంలోని వైయస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నేడు పద్మ భూషణ్, కళా ప్రపూర్ణ, కవికోకిల, కవితా విశారద, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన వైయస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ PAC మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు అభిమానులు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాసు కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**

నరసరావుపేట పట్టణంలోని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి స్వగృహానికి వెల్లి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావు పేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,మరియు నియోజవర్గ నాయకులు పాల్గొన్నారు.

## విశ్వకవి గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకి పెట్టాలి



**పాత గుంటూరు, మేజర్ న్యూస్ :** కవి కోకిల విశ్వ కవి సామ్రాట్ నవయుగ కవి చక్రవర్తి విశ్వ విజేత గుర్రం జాషువా 130 జయంతి కార్యక్రమం నగరం పాలెంలోని గుర్రం జాషువా విగ్రహం దగ్గర విగ్రహాన్ని పూల దండలు వేసి ఘన నివాళులు అర్పించటమైనది. జి ఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ గుర్రం జాషువా తను రచనల ద్వారా పాటల ద్వారా మనువాద కుట్రలను తిప్పి కొట్టిన గొప్ప మేధావి గండపిండేరం తొడిగించుకుని పద్మశ్రీ అవార్డు పొందారని ఆయన రచన ద్వారా లక్షలాదిమందిని చైతన్యం చేసినగుర్రం జాషువా అని భగత్ సింగ్ తెలిపారు. తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ భారతదేశంలో గొప్ప మేధావి బహుజనులకు మార్గదర్శకులు ప్రజలను చైతన్యం చేయడంలోఆయన రచనలు బీసీ కులాలకు పేద వర్గాలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని ఆయన మార్గంలో నేటి యువతరం మూఢ విశ్వాసాల నుండి ప్రజలను బయటకు తీసుకురావాలని వినుకొండ ప్రాంతంలో ఆయన జన్మించారు కనుక పలనాడు జిల్లాకి గుర్రం జాషువా జిల్లాగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని తాటికొండనరసింహారావు కోరారు. ప్రజాపోరు నాయకులు ఎం రవికుమార్ అనేకమంది ప్రముఖులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## బరువు తగ్గించుకుందాం... ఇలా

**– వైద్యుల సలహాలు, సూచనలు ఇవే**





**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** బరువు తగ్గడం కోసం చాలా మంది కడుపు మాడ్చుకుంటారు. కానీ, ఇది సరైన పద్ధతి కాదు. ఇలా చేయడం వల్ల లేని పోని ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గడం కోసం సరైన ఆహారాన్ని ఎంచుకోవడమే కాదు, ఆ ఆహారాన్ని ఎక్కువ సార్లు నమిలి తినాలి. అలాగే ఆహార వేళలు, నిద్రవేళలు కూడా క్రమం తప్పకుండా పాటించగలిగితే, తక్కువ సమయంలో ఎక్కువ బరువును వదిలించుకోవడం కష్టమేమీ కాదని ... ఆహార నియమాల్లో ఎలాంటి రహస్యాలు దాగి ఉన్నాయో వైద్యులు వివరిస్తున్నారు. ఇక చదివేద్దామా...

ఉపవాసాలు, వ్యాయామాలు, ఆహార నియమాలు... ఇలా బరువు తగ్గడం కోసం అనేక ప్రయత్నాలు చేసి విసిగిపోయినవాళ్లు, అందుకు అడ్డుపడే ఇతరత్రా అంశాల మీద కూడా దృష్టి పెట్టాలి. బరువు తగ్గకపోగా, కడుపుబ్బరం, అజీర్తి లాంటివి ఇబ్బంది పెడుతున్నప్పుడు ఫుడ్ ఇన్‌టాలరెన్స్, ఫుడ్ అలర్జీలను కూడా పరీక్షించుకోవాలి. అలాగే కొన్ని పదార్థాలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. వీటిలో అత్యధిక చక్కెరను కలిగి ఉండే పదార్థాలు ప్రధానమైనవి. వీటితో కీళ్ల వాపులు, మలబద్ధకం, పొట్టలో వాయువులు, నొప్పులు వేధిస్తాయి. అలాగే ఇన్‌ఫ్లమేషన్ బరువు తగ్గే ప్రయత్నాలకు అడ్డుపడుతూ ఉంటుంది. కాబట్టి ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా ఉండే రంగురంగుల పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్ తినాలి. వీటితో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, బరువు తగ్గే ప్రక్రియ ఊపందుకుంటుంది. అలాగే ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రోత్సహించే ఫాస్ట్ ఫుడ్స్, నూనెలో వేయించిన పదార్థాలు, తీయని పానీయాలు తీసుకోవడం మానేయాలి.

**రాత్రి భోజనం సాయంత్రమే...**

రాత్రి తినే భోజనానికీ ఉదయం తీసుకునే అల్పాహారానికీ మధ్య కనీసం 12 గంటల నిడివి ఉండాలి. కానీ రాత్రి ఆలస్యంగా 12 గంటలకు తిని, ఉదయాన్నే 8 గంటలకే బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థకు సరిపడా విశ్రాంతి అందదు. అలాగే సాయంత్రానికి మన మనసు, శరీరం, అంతర్గత అవయవాలన్నీ విశ్రాంత స్థితిలోకి చేరుకోవడం మొదలుపెడతాయి. కాబట్టి సాయంత్రం వీలైనంత పెందలాడే భోజనం ముగించేయడం మంచిది. ఈ అలవాటును అలవరుచుకోవడం వల్ల తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమయ్యే సమయం చిక్కుతుంది.

**మూడు భోజనాలు తినొచ్చు :**

కొంతమంది రోజుకు రెండు భోజనాలు, ఒక భోజనానికే పరిమితమైపోతూ ఉంటారు. కానీ నిజానికి రోజుకు మూడుసార్లు లేదా సాయంత్రం ఐదు గంటలకు ఒక స్నాక్‌తో కలిపి నాలుగు సార్లు తింటూ కూడా బరువు తగ్గొచ్చు. అయితే తిన్న ప్రతిసారీ ఏం తింటున్నామన్నది గమనించుకోవాలి. రోజుకు సరిపడా క్యాలరీలను అందించే ఆహారాన్ని మూడు, నాలుగు భాగాలుగా విభజించుకుని తినడం వల్ల బరువు పెరిగే సమస్య ఉండదు. అదనపు క్యాలరీలు అందించే ఆహారంతోనే అసలు సమస్యంతా! కాబట్టి ఒంటిపూట భోజనంతో, లేదా రెండు పూటల భోజనంతో అవసరానికి మించి ఎక్కువ క్యాలరీలు తీసుకోడానికి బదులుగా మూడు భోజనాలతో తక్కువ క్యాలరీలు పొందుతూ బరువును తగ్గించుకోవచ్చు. అలాగే ఆహారంలోని క్యాలరీలతో పాటు అందే ప్రొటీన్ పరిమాణం మీద కూడా దృష్టి పెట్టాలి. భోజనంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

**నిద్ర.. నీళ్లు...**

రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోయినా, సరిపడా నిద్రపోకపోయినా శరీరానికి కోలుకునే సమయం దక్కదు. దాంతో భౌతిక ఒత్తిడి పెరుగుతుంది. ఆలస్యంగా నిద్రపోయేవాళ్లు రాత్రి భోజనం తర్వాత కూడా చిరుతిళ్లు తినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ విధంగా అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుని బరువు పెరుగుతారు. అలాగే తిన్నది పూర్తిగా జీర్ణమవడానికి సరిపడా నీళ్లు అవసరం. కాబట్టి రోజుకు కనీసం రెండు నుంచి రెండున్నర లీటర్ల నీళ్లు తీసుకోవాలి.

**ఆహారం నమిలి తినాలి...**

ఆహారాన్ని హడాహుడిగా, ఆదరాబాదరాగా తినేయడం సరికాదు. చక్కగా నమిలి తినడం వల్ల, తినే వేగం తగ్గి, తక్కువ ఆహారం తినగలుగుతాం. అలాగే ఆహారం తింటున్న సంకేతాలు మెదడుకు అంది తక్కువ ఆహారంతోనే సంతృప్తి చెందగలుగుతాం! ఆహారాన్ని చక్కగా నమిలి తినడం వల్ల, జీర్ణాశయానికి శ్రమ తగ్గుతుంది. పోషక శోషణ పెరుగుతుంది.

**వ్యాయామం ఇలా...**

కండరాలు క్యాలరీలను చక్కగా ఉపయోగించుకోవాలంటే, కండరాలను పెంచే రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయాలి. ప్రత్యేకించి బరువు తగ్గాలనుకునేవాళ్లు గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలతో పాటు కండరాలు పెరిగే వ్యాయామాలు చేయడం తప్పనిసరి.

**ఆరోగ్య సూత్రాలు :**

తింటున్న ఆహారం మీద దృష్టి పెట్టాలి. తినేటప్పుడు ఫోన్లు, టివిలకూ, కబుర్లకూ దూరంగా ఉండాలి. ప్రతి ముద్దనూ ఎక్కువ సార్లు నమిలి తినాలి. ఆహార వేళలు కచ్చితంగా పాటించాలి. రోజులో చివరి భోజనం వీలైనంత త్వరగా (సాయంత్రం 6–7 గంటలు) ముగించాలి. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయొచ్చు. అందుకోసం ఎవరికి వారు వారి జీవనశైలిని బట్టి 12 నుంచి 14 గంటల రాత్రి ఉపవాసం పాటించాలి. మధుమేహులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఉపవాసం విషయంలో వైద్యుల సలహా తీసుకోవాలి. ఆహారంలో కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, ప్రొటీన్ పెంచి, పాలిష్ పట్టిన పదార్థాలు, చక్కెర, కొవ్వు పదార్థాలు తగ్గించాలి. నడక, రెసిస్టెన్స్ ట్రైనింగ్, సరిపడా నిద్ర, నీళ్లు.. వీటి మీద దృష్టి పెట్టడంతో పాటు, నిద్రకు ముందు స్క్రీన్ టైమ్ తగ్గించాలి. కంటినిండా నిద్రపోవాలి. అలర్జీలు, ఇన్‌టాలరెన్స్‌లు ఎవరికి వారు గమనించుకోవాలి. కడుపుబ్బరం, అజీర్తి, అపానవాయువులు, దురదలు లాంటివి వేధిస్తూ ఉంటే వైద్యులను కలవాలి. సాధారణంగా బరువు తగ్గడం కోసం, తీసుకుంటున్న క్యాలరీలు, ఖర్చవుతున్న క్యాలరీల మీదే దృష్టి పెడుతూ ఉంటాం. కానీ ఆహారాన్ని ఎలా నములుతున్నాం, ఎంత తింటున్నాం, ఎప్పుడు తింటున్నాం, ఎంత నిద్రపోతున్నాం అన్నది కూడా ముఖ్యం. వీటిని ఎవరికి వారు పరిశీలించుకుని, వైద్యుల సూచనల మేరకు ఆహార, వ్యాయామ నియమాలను పాటించగలిగితే ఆరోగ్యకరమైన తీరులో అధిక బరువును వదిలించుకోవచ్చు. అన్నం, రోటీలతో పొట్టను నింపేస్తే అవి త్వరగా జీర్ణమై తరచూ ఆకలి వేధిస్తుంది. కాబట్టి సంతృప్తితో పాటు సరిపడా పోషకాలను అందించే కూరగాయలు ఎక్కువగా, అన్నం, రోటీలు తక్కువగా తీసుకోవాలి. అందుకోసం భోజన పళ్లెంలో పావు వంతును మాత్రమే అన్నం లేదా రోటీతో నింపుకోవాలి. ఇంకొక పావు వంతు సలాడ్/కూరగాయలు, పావు వంతు ప్రొటీన్ (చికెన్/చేపలు/గుడ్లు/రాజ్మా, సెనగలు), పావు వంతు పప్పు, పెరుగుతో నింపేయాలి.

## జర్నలిస్టుల పిల్లలకు శివశక్తి ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు

**– ఇంటి స్థలాలు సహా వారి అన్ని సమస్యలను పరిష్కరిస్తాం : జీవీ**

**– రూ. 210 కోట్లతో వినుకొండ మంచినీటిపథకం పూర్తి చేస్తాం : జీవీ**

**– పర్యాటకక్షేత్రంగా రామలింగేశ్వర స్వామి ఆలయం**





**వినుకొండ మేజర్ న్యూస్:** ఇంటర్ నుంచి పీజీ వరకు చదివే జర్నలిస్ట్ మిత్రుల పిల్లలకు ప్రోత్సాహకంగా శివశక్తి ఫౌండేషన్ తరపున మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు వినుకొండ ఎమ్మె ల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. 30ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎంతో ప్రోత్సాహం, సహకారం అందించిన వారిపై గౌరవసూచకంగానే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వచ్చే 5 ఏళ్లు కూడా ఇలానే ఇంటర్ నుంచి పీజీ వరకు చదివి జర్నలిస్టుల పిల్లలు ఒక్కొక్కరికీ రూ. 10వే ల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. వారంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు రూ. 10 వేలు చొప్పున అంద జేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంటి స్థలాల విషయంలో న్యాయం చేసిందని త్వరలో వారికి రెండు సెంట్ల పట్టాలు ఇస్తామన్నారు. జర్నలిస్టుల కాలనీని రాష్ట్రంలోనే ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామన్నారు. జర్నలిస్టుల ఇతర పెండింగ్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. రూ. 210 కోట్లతో వినుకొండ పట్టణానికి శాశ్వతమంచినీటి పథకం తీసుకుని వస్తున్నామని, దానిద్వారా కొత్త కాలనీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇదే సమయంలో ఎన్నెస్పీ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం, పార్క్, షాదీఖానా, టీటీడీ కల్యాణమండపం, గుర్రం జాషువా డిజిటల్ లైబ్రరీ, స్విమ్మింగ్‌పూల్, హెూల్‌సేల్ కూరగాయల మార్కెట్‌తో భవిష్యత్ అవసరాలకు సరిపడిన రీతిలో తీర్చిదిద్దుతాం. గడిచిన అయిదేళ్లలో అక్కడ కనీసం ఒక్క బిల్డింగ్ కట్టలేదని, వైకాపా ప్రభుత్వం లో వినుకొండకు ఒక్క పనిచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న 5ఏళ్లలో రామలింగేశ్వ రస్వామి ఆలయం, ఘాట్ రోడ్ సహా ప్రతి పని పూర్తి చేస్తా. ఆ ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ అసిస్టెంట్ చిట్టిబాబు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల రెవిన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పులివర్తి చిట్టిబాబు (51)అనారోగ్యంతో ఆదివారం మృతి చ. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. చిట్టిబాబుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిట్టిబాబు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది పలువురు. ప్రజా ప్రతినిధులు సందర్శించి పూలమాలలు. వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

# క్రీస్తు లూథరన్ దేవాలయంలో యూత్ సండే పాస్టర్ ప్రభాకర్ రావు

**మాచవరం, మేజర్ న్యూస్ :**

మండల కేంద్రమైన మాచవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీలో క్రీస్తు లూథరన్ దేవాలయంలో యూత్ సండే నిర్వహించడం జరిగిందని మాచవరం క్రీస్తు లూథరన్ దేవాలయం ఫ్యాలీస్ పాస్టర్ రెవరెండ్ వై ప్రభాకర్ రావు అన్నారు. ఆయన దైవ సందేశము ఇస్తూ యువత దేవుని మార్గము లో నడవాలని, క్రీస్తు నందు విశ్వాసం తో ఎదగులని దైవ సందేశమును ఇచ్చారు. యూత్ సండే యువతి, యు వకులు నిర్వహించి, ఫలహారం అంద జేశారు. ఈ కారేక్రం లో డెలికేటు రాగిడి చిన్న సైదులు,ఫాస్టర్మ్మ సోనీ , సంఘ పెద్దలు, మహిళ సమాజము,యూత్,సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



# ఓర్పు, దృష్టి, మేధస్సు కలయికే చదరంగం

- మనం గడిపే ప్రతి క్షణం విలువైన దే
- ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి
- విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా కొనసాగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు





**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** చెస్ ఆటలో మనం గడిపే ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" ఘనంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపితో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ముందుగా ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి మాట్లాడుతూ చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికని తెలియజేసారు. దేశం నలుమూలల నుండి వచ్చే క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా, అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. అయితే, ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, విఫలాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ, ఎప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలన్నారు. నిరంతర అభ్యాసం, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే విజయాలు మన సొంతమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పుడూ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కోచ్ చెప్పే సూచనలపై నమ్మకం ఉంచాలని, ఆయన తప్పులు సరిచేసి, సరైన మార్గంలో నడిపిస్తారని తెలిపారు. ఆటలోని ప్రతి అనుభవాన్ని పాఠంగా తీసుకొని ముందుకు సాగితేనే నిజమైన క్రీడాకారుడిగా ఎదగవచ్చునని అభిప్రాయపడ్డారు. ప్రతి గేమ్ ఒక కొత్త అనుభవం, ప్రతి తప్పు ఒక కొత్త పాఠమని, క్రీడాకారులు ఎప్పుడూ సంతృప్తి చెందకుండా, మరింత నేర్చుకోవాలనే ప్రయత్నం చేయాలన్నారు. "నెరవేర్చాం" అనుకోవడం కంటే "ఇంకా నేర్చుకోవాలి" అనే తపన ఉండాలన్నారు. ఓర్పు, దృష్టి, మేధస్సుల కలయిక : ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఏకే వర్మ చెస్ అనేది ఆలోచన, ఓర్పు, దృష్టి, మేధస్సుల కలయికని ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఏకే వర్మ అన్నారు. ఈ ఆటలో ప్రతి క్రీడాకారుడు తన ప్రతిభను నిరూపించుకోవడానికి, తన ప్రతిభను మరింతగా




మెరుగుపరచుకోవడానికి ఇలాంటి వేదికలు అవసరమన్నారు. అందుకే చెస్ ఆట అనేది మన మానసిక సామర్థ్యాన్ని విస్తరింపజేసే గొప్ప శాస్త్రమన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులతో ఫోటోలు దిగారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

**62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ 7.వ.రౌండ్ ఫలితాలు**

గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీ లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో ఏడో రౌండ్ ముగిసే సరికి, తొలి ఆరు బోర్డులలో నిర్ణయాత్మక ఫలితాలు రాకపోవడంతో ఆధిక్యంలో మార్పు లేకుండా నిలిచింది. ఇప్పటివరకు 6 పాయింట్లు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన గ్రాండ్‌మాస్టర్స్ సశికిరణ్, అభిజీత్ గుప్తా, రైల్వేస్ ఐఎం అరోన్యక్ ఘోష్, ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డి లీడ్‌ను కొనసాగించారు. వీరితో పాటు విజయాలు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన జీఎం దీప్ సెంగుప్తా, రైల్వేస్ ఐఎం అయుష్ శర్మ, తమిళనాడుకు చెందిన ఐఎం హర్ష్ సురేష్ కూడా 6 పాయింట్ల క్లబ్‌లో చేరారు. అభిజీత్ క్వీన్స్ గాంబిట్ ఓపెనింగ్‌ను సశికిరణ్ తిరస్కరించగా, గ్–ఫైల్ లో మూడు పావులు ఉన్నా పెద్దగా సమస్య లేకుండా 31 మువ్స్ తరువాత డ్రాకు ఒప్పుకున్నాడు. ఇదే విధంగా అరోన్యక్ – అజయ్ ఇంగ్లీష్ ఓపెనింగ్ లో రిస్క్‌తీసేందుకు వెనుకంజ వేశారు. 20వ మువ్ లో మూడు సార్లు పునరావృతం అవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాప్ సీడ్ పి. ఇనియన్ (తమిళనాడు) %–% హెచ్. గౌతమ్ కృష్ణ (కేరళ) మధ్య పోటీ కూడా డ్రాగా ముగిసింది. మహారాష్ట్రకు చెందిన కాశిష్ మనోజ్ జైన్ తో ఆడిన జీఎం సూర్యశేఖర్ గాంగూలీ కూడా క్లిష్టమైన స్థితిలో విజయం సాధించలేక డ్రా చేశాడు. టాప్ బోర్డులలో మొదటి నిర్ణయాత్మక విజయం జీఎం దీప్ సెంగుప్తా పేరున నిలిచింది. రైల్వేస్ ఐఎం సిద్ధాంత్ మోహాపాత్రపై ఫ్రెంచ్ డిఫెన్స్ ఆడి, 14వ మువ్ లోనే క్వీన్స్ ఎక్స్చేంజ్ చేశారు. దీప్ తన సెంటర్ పావు శక్తిని చక్కగా వినియోగించి 48వ మువ్ లో గెలుపు నమోదు చేశాడు. గత రౌండ్‌లో ఐఎంను ఓడించిన తమిళనాడు మాజీ ఛాంపియన్ ఎన్. సురేంద్రన్ ఈసారి తెలంగాణ జీఎం ప్రణీత్ వుప్పాలపై ఘన విజయం సాధించాడు. సిసిలియన్ డిఫెన్స్‌లో మధ్యభాగంలో క్వీన్ సాక్రిఫైస్ చేసిన ప్రణీత్ తరువాతి మువ్‌లో తప్పిదం చేయడంతో సురేంద్రన్ రుక్ సాక్రిఫైస్ చేసి క్వీన్ ప్రమోషన్ సాధించాడు. దీంతో గ్రాండ్‌మాస్టర్ ఓటమి అంగీకరించాల్సి వచ్చింది. రైల్వేస్ జీఎం వినయేష్ ఎన్.ఆర్. ను ఆంధ్రకు చెందిన శ్రవ్యశ్రీ భీమరాసెట్టి సంచలన విజయం నమోదు చేసింది. రూయ్ లోపెజ్ గేమ్ లో కాస్త ఆధిక్యం ఉన్నా క్వీన్ పొరపాటుతో విన్నేశ్ గేమ్ వదులుకోవాల్సి వచ్చింది. రైల్వేస్ ఐఎం సుభయాన్ కుందు తో సమంగా సాగిన రుక్ – పావుల ఎండ్‌గేమ్ లో హర్ష్ సురేష్ కచ్చితమైన నైపుణ్యంతో గెలుపొందాడు. అయితే మరో తమిళనాడు ఐఎం మనీష్ ఆంటో క్రిస్టియానో మాత్రం విఫలమై, ఎం.పీ కి చెందిన అయుష్ శర్మ చేతిలో ఓడిపోయాడు.

# ఉపాధ్యాయులను సన్మానించడం పూర్వజన్మ సుకృతం

- చేబ్రోలులో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- ఆత్మీయ భావాలను పంచుకున్న విద్యార్థులు
- రాఘవేంద్ర ట్యుటోరియల్స్ 1994 బ్యాచ్ అపూర్వ కలయిక



**గుంటూరు, మేజర్ న్యూస్ :** మనం చదువుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయి... నాడు ఎంతో కలిసిమెలిసి ఆటపాటతో చదువుకున్నాం... ఉపాధ్యాయులు మనల్ని ఎంతో ప్రయోజకులుగా తీర్చిదిద్దారు.. నేడు మనం ఈ స్థితిలో ఉన్నామంటే ఆ ఉపాధ్యాయులే కారణం.. వాళ్లు నేర్పిన విద్యాబుద్ధులు, మానవత్వ విలువలు.. తోటి వారికి సహాయ పడే తత్వం మాకు గుర్తుంది... అదే బాటలో పయనిస్తున్నాం.. భవిష్యత్తులో పయనిస్తూనే ఉంటాం... అంటూ పూర్వ విద్యార్థులు ఆదివారం చేబ్రోలులో కలిసి ఎంతో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993–94 సంవత్సరములో. తమకు చదువు చెప్పిన శ్రీ రాఘవేంద్ర ట్యుటోరియల్స్ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అంగరంగ వైభవంగా నభూతో నభవ్యతి అనే రీతిలో కన్నుల పండుగ నాటి ఉపాధ్యాయులు సత్కరించి. తమ రుణం ఇలా తీరిందంటూ ఆనంద ఉత్సాహాలతో ఉపాధ్యాయుల ఆశీర్వచనాలు అందుకున్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు లోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఘనంగా ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాటి పాఠశాల కరస్పాండెంట్ గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సన్మానం నిర్వహించడం తమ జీవితంలో మరచిపోలేని మధురానుభూతి అని అభివర్ణించారు. మీరు ఎంత ఉన్నత స్థాయిలో ఉన్న తల్లిదండ్రులను మరువకూడదని సూచించారు. మిమ్మల్ని నాడు చదివించడానికి మీ తల్లిదండ్రులు పడ్డ కష్టాలను వివరించారు. ఆడపిల్లలకు అత్తమామలు, తల్లిదండ్రులు ఇద్దరు రెండు కళ్ళతో సమానమని సూచించారు. మగ పిల్లలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ తల్లిదండ్రుల కంట కన్నీరు పెట్టకుండా ఆదరించాలని సూచించారు. మీకు ఎంత వయసు వచ్చినప్పటికీ తండ్రికి బిడ్డలా ఉపాధ్యాయుడికి శిష్యులే అనే విషయం గుర్తుంచుకోవాలన్నా రు. మీకు ఉన్న ఆదాయంలోనే సమాజ శ్రేయస్సుకు ఎంతోకొంత సహాయం చేయాలని సూచించారు. 1993–1994 విద్యా సంవత్సరంలో రాఘవేంద్ర ట్యుటోరియల్స్ లో చదువుకున్న బ్యాచ్ విద్యార్థుల్లో ఎంతోమంది ప్రయోజకులు కావటం తమకు గర్వంగా ఉందని గట్టుపల్లి చెప్పారు. మీరు మీ పిల్లల్ని చదివించి ఉన్నత విద్యావంతులతో పాటు మంచి విద్యాబుద్ధులు చెప్పించాలని సూచించారు.



మరో ఉపాధ్యాయుడు రాఘవేంద్ర ఆ ట్యుటోరియల్ డైరెక్టర్ నజీర్ చాంద్ బాబు మాట్లాడుతూ మీ అందరి గ్రూపులో మమ్మల్ని ఉంచితే మాకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మీ పిల్లల్ని కూడా మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరాశరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతుంది ఇంతమంది విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దిన మా జీవితం ధన్యమని చెప్పారు. చదువుతోపాటు చక్కటి ఉన్నత విలువలు నేర్చుకున్నారని విద్యార్థులు ఆశీర్వదించారు. మాకు చదువు నేర్పిన గురువులను సత్కరించడం పూర్వజన్మ సుకృతమని ఆమె చెప్పారు. మంచాల మాజీ సర్పంచ్ మండలి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను ఈ ట్యుటోరియల్స్ లో చదివి చక్కటి విద్యను నేర్చుకున్నాను అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేయాలని తద్వారా పేద ప్రజలకు సేవలు అందించాలని రాఘవేంద్ర ట్యుటోరియల్స్ ఉపాధ్యాయులు తరచూ తనకు సూచించేవారని ఆయన చెప్పారు. సన్మానం అనంతరం పూర్వ విద్యార్థులు చక్కటి విందు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థునులకు, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఒకరినొకరు ఆప్యాయతగా అన్యోన్యంగా పలకరించుకుని తమ కుటుంబ సంతోషాన్ని పంచుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, శివరామకృష్ణ, పొట్టి శ్రీనివాసరావు, జల్ది నాగరాజుతో పాటు పూర్వ విద్యార్థునులు అరుణ, రాజ్యలక్ష్మి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత
శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని
ముఖులిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా
మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని
ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం..

ఎన్.లక్ష్మీనారాయణ
రీజనల్ మేనేజర్
సెల్: 6301107116

పి.బాలు
బ్యూరో ఇంఛార్జ్
సెల్: 9440747307